క్లుప్తంగా

మునగాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్


బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

మునగాల : మునగాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి బదిలీపై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. దీంతో కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో డీఏటీగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ బదిలీపై మునగాల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా, మునగాల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నల్లమాద శ్రీను, ధరణి ఆపరేటర్ శ్రీశైలంను కలెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో రిలీవ్ చేసినట్లు మండల ఆర్ఐ ఎస్.రామారావు తెలిపారు.

ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులు

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలో పలు వార్డుల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'సీసీ కెమెరాల ఏర్పాటులో అక్రమాలు జరగలేదు'

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో చందాలు వసూలు చేసి పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు సోషల్ మీడియా వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని గ్రామ కమిటీ సభ్యులు బత్తిని శ్రీనివాస్, ముస్కుల వీరారెడ్డి, జినుగు కోటి రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రూ. 4,10,500 విరాళాలు వచ్చాయని, వాటిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 4,03,000 ఖర్చు చేసినట్లు తెలిపారు. మొత్తం వివరాలు గ్రామ కమిటీ దగ్గర ఉన్నాయని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటులో ఎవరు అక్రమాలకు పాల్పడిన చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని అన్నారు.

పండుగ సాయన్నకు నివాళి


పండుగ సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో శుక్రవారం ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతిని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దూళిపాల ధనుంజయనాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంజమూరి మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్‌కుమార్, చిలరాజు శ్రీను, వెంకట్, బుచ్చిబాబు, వెంకన్న, భరత్, కృష్ణయ్య, రామనర్సయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి చంద్రశేఖర్ రాజు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో డెంగీ, మలేరియా, కలరా, అంటు వ్యాధుల వ్యాప్తికి కారణాలు, వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డి.విజయనాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్.జానిపాషా, కర్నాటి శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలుకూరు : హైదరాబాద్‌లో ఈ నెల 10న జరిగే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జైగౌడ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురగాని లింగయ్యగౌడ్ కోరారు. శుక్రవారం చిలుకూరులో ఉత్సవాల పోస్టర్‌ను జైగౌడ ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ సంఘం నాయకులు కొండా వీరబాబుగౌడ్, కొండా వెంకటేశ్వర్లు, బాలేబోయిన నరేష్, యరగాని రాంబాబు, యరగాని నాగేంద్రగౌడ్, కాసాని దశరథ, మండవ అచ్చయ్య, బెల్లంకొండ రాధాకృష్ణ , కొండా అంజయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం

- వందల ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- అలుగు పోసిన చెరువులు
- పొంగిపొర్లిన వాగులు
- దెబ్బతిన్న రోడ్లు.. రాకపోకలకు ఇబ్బందులు పడిన ప్రజలు


నడిగూడెం సమీపంలో నీట మునిగిన వరి పొలాలు

చిలుకూరు : మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు నిండి అలుగులు పోశాయి. వాగులు పొంగిపొర్లాయి. చిలుకూరు అంతర్గంగ వాగు వరద ఉధృతికి పంట పొలాలు నీట మునిగాయి. చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డుపై నుంచి వరద నీళ్లు ప్రవహించాయి. బేతవోలు, నారాయణపురం చెరువులు నిండుకుండలా మారాయి. వరద తాకిడికి చిలుకూరు నుంచి కొత్త కొండాపురం వెళ్లే రోడ్డు ఈదులబావి వద్ద తెగింది. దీంతో రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఇళ్ల మధ్యకు వరదనీరు..

నడిగూడెం : మండలంలో గురువారం రాత్రి ఈదరుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో నడిగూడెంలోని చౌదరి చెరువు, శ్రీసారంగేశ్వరస్వామి చెరువు, చాకిరాల, రామాపురం, రత్నవరం, శ్రీరంగాపురం, వల్లాపురం, వేణుగోపాలపురం గ్రామాల చెరువులు నిండి అలుగుపోశాయి. నడిగూడెం, చాకిరాల, రామాపురం, రత్నవరం గ్రామాల్లో వరి పొలాలు వందల ఎకరాల్లో నీట మునిగాయి. నడిగూడెం చౌదరి చెరువు అలుగు పోయడంతో బస్టాండ్ సెంటర్ మీదుగా వరద నీరు ప్రవహించడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. లోతట్టు ప్రాంతాలైన బీసీ, ఎస్సీ కాలనీల్లో పలువురి ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పొలాల్లో మేట వేసిన రోడ్డు మట్టి..

నడిగూడెం మండల కేంద్రం నుంచి అనంతగిరి మండలం శాంతినగర్ వరకు రూ.25 కోట్లతో చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రత్నవరం వద్ద నిర్మించిన కల్వర్టు నుంచి వరదనీరు వెళ్లేందుకు సరిపోక పొలాల మీదుగా ప్రవహించింది. రోడ్డు నిర్మాణానికి నాసికరమైన మట్టి పోయడంతో ఆ మట్టి వరదకు ఆ ప్రాంతంలోని పలువురు రైతుల పొలాలపై మేట వేసింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పొలాలపై మట్టి మేటను తొలగించాలని కోరుతున్నారు.

ఆలయంలోకి చేరిన వర్షపునీరు

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని తొగర్రాయిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సంతాన వేణుగోపాలస్వామి, రాలింగేశ్వరస్వామి ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. అంతర్గంగ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తొగర్రాయి నుంచి అడ్లూరుకు వెళ్లే డొంక రోడ్డు మధ్యలో ఉన్న పురాతన వంతెన వద్ద నీరు నెమ్మదిగా దిగువకు ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం జేసీబీ సహాయంతో వంతెన వద్ద తట్టుకున్న చెత్తను తొలగించారు. వంతెన లోలెవల్‌లో ఉండటంతో చెత్తచెదారం అడ్డుతగిలి భారీ వర్షాలు వచ్చినప్పుడు నీరు దిగువకు వేగంగా వెళ్లకుండా ఆలయంతో పాటు ఇళ్లలోకి చేరుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన ఎత్తు పెంచి బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మిస్తే అడ్లూరు ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అంటున్నారు.


చిలుకూరులో నీట మునిగిన పంట పొలాలు


నడిగూడెంలో ఎస్సీ, బీసీ కాలనీ మధ్య గల వాగు పొంగి వీధుల్లోకి వచ్చిన వరదనీరు


నడిగూడెం : రత్నవరం వద్ద పొలాల్లో మేట వేసిన రోడ్డు మట్టి


నడిగూడెం బస్టాండ్ వద్ద రహదారిపై ప్రవహిస్తున్న చౌదరి చెరువు అలుగు నుంచి వచ్చే వరద నీరు


కోదాడరూరల్ : తొగర్రాయిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో..


చిలుకూరు నుంచి కొత్త కొండాపురం వెళ్లే దారిలో ఆర్లెగూడెం వద్ద తెగిన రోడ్డు

ఎస్సీ కాలనీలోకి వరదనీరు రాకుండా చర్యలు

నడిగూడెం : వర్షాల దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపమ్మ తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శుక్రవారం నడిగూడెంలో చౌదరి చెరువు అలుగు పోస్తుండడంతో ఆ వరద నీరు ఎస్సీ కాలనీలోకి రాకుండా సారంగేశ్వర చెరువులో చేరేందుకు జేసీబీతో చేపట్టిన మరమ్మతు పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎలకా ఉమారాణి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వెంకన్న, సిబ్బంది ఉన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం


కాలువలో పూడిక తీయిస్తున్న మున్సిపల్ అధికారులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని 18వ వార్డులో మురుగు నీటి కాలువ పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. సీఎస్ఐ చర్చి నుంచి లింగగిరి మెయిన్ రోడ్డు కాలువలో చెత్త, పూడికను జేసీబీ సహాయంతో తొలగించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువ పూడిక తీయించినట్లు కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్, శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మునగాల : రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మునగాల మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. రోడ్లపై నీరు ఉంటున్నందున వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. చెట్లు, శిథిలావస్థకు చేరిన భవనాల కింద ఉండవద్దన్నారు. రైతులు వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకవద్దని హెచ్చరించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లవద్దన్నారు. వాగులు, చెరువులలోకి చేపల వేటకు వెళ్లవద్దని, పిల్లలు, వృద్ధులను ఒంటరిగా బయటకు పంపవద్దన్నారు. పోలీస్ శాఖ 24 గంటలు అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని ఎస్ఐ ప్రజలను సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

హుజూర్‌నగర్ : జిల్లాలో 35 పోలీస్ చట్టం అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ ఆయా నిబంధనలు పాటించాలని సీఐ చరమందరాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ రానున్న గణేశ్ ఉత్సవాలు, బోనాలు, మిలాద్ - ఉన్- నబి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని చెప్పారు. పండుగల దృష్ట్యా సర్కిల్‌లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో గల డీజే యజమానులను ముందస్తుగా బైండోవర్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నిబంధలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

నేరేడుచర్ల : నులిపురుగుల నివారణకు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మింగించాలని నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిని పున్నా నాగిని అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల పీహెచ్‌సీలో పాలకవీడు, నేరేడుచర్ల మండలాల అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈనెల 11వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరు ఏళ్లలోపు చిన్నారులకు మధ్యాహ్న భోజనం తరువాత మాత్రలు మింగించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ సల్వాది శ్రీనివాస్, హుజూర్‌నగర్ సీడీపీఓ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ధనమ్మ, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు


నేరేడుచర్ల : ఎస్ఐ రవీందర్‌కు రాఖీ కడుతున్న ప్రగతి విద్యాలయం విద్యార్థులు


హుజూర్‌నగర్ : బాలురకు రాఖీలు కడుతున్న బాలికలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఫెరల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓ ప్రకాష్, హెచ్ఎం మురుగన్ పిళ్లై బాలురకు బాలికల చేత రాఖీలు కట్టించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శన చేసి అలరించారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులకు రాఖీలు కట్టిన విద్యార్థులు

నేరేడుచర్ల : రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా నేరేడుచర్ల పట్టణంలోని ప్రగతి విద్యాలయం విద్యార్థినులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవీందర్‌తో పాటు పోలీసులందరికీ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాలయం డైరెక్టర్ కొప్పుల రంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఐడియల్ హైస్కూల్‌లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కరస్పాంటెంట్ సముద్రాల రమణకుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోదరభావం పెంపొందించేందుకు..

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తుగా రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలురకు బాలికల చేత రాఖీలు కట్టించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన మాట్లాడుతూ.. చిన్నారుల మధ్య సోదరభావం పెంపొందించేందుకు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, రాంబాబు, లక్ష్మి, రజియా, మల్లికా, స్వప్న, జ్యోతి, వైదేహి, త్రివేణి, వీరకుమారి, నాగమణి, సాజిదా, పాల్గొన్నారు.


నడిగూడెం : శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో..


మేళ్లచెరువు : ఐడియల్ హైస్కూల్‌లో..

బీమా చెక్కుల అందజేత


సిరిపురంలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జిల్లా లీడ్ మేనేజర్ నాగప్రసాద్

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ మేనేజర్ నాగ ప్రసాద్ కోరారు. మండలంలోని సిరిపురం, వల్లాపురం గ్రామాలకు చెందిన వట్టికూటి శ్రీనివాస్ (38), బత్తుల వీరమ్మ (42) ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంలో రూ. 436తో పాలసీ తీసుకున్నారు. ఇరువురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున మంజూరైన బీమా చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్ నాయక్, సిరిపురం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ దినేష్‌కుమార్, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సతీష్, మల్లారెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, ఉదయ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'ధర్మస్థలి' దోషులను శిక్షించాలి


నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య నాయకులు

హుజూర్‌నగర్ : ధర్మస్థలి ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి డిమాండ్ చేశారు. ధర్మస్థలి ఘటనను ఖండిస్తూ శుక్రవారం హుజూర్‌నగర్‌లో మెయిన్ రోడ్డుపై సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై దాడులు, మానవత్వాన్ని కలిపే ఘటనలు ఇంకా జరగడం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకురాళ్లు సామ్రాజ్యం, లింగమ్మ, శ్రీలత, నాగలక్ష్మి, అరుణ, వీరమ్మ, మంగమ్మ, మల్లమ్మ, మారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి చీర, సారె సమర్పణ


వేడుకలో వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతమ్మ, లక్ష్మీదేవి అమ్మవార్లకు హుజూర్‌నగర్ వాసవి క్లబ్,వాసవి వనిత క్లబ్ లెజెండ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం చీర, సారె, ఒడిబియ్యం పోసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈఎస్ఐ హాస్పిటల్‌కు ఫ్రిజ్ కోసం రూ.10 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వికుమార్, జిల్లా గవర్నర్ ఆర్.విజయలక్ష్మి, సభ్యులు బి.కృష్ణ, శబరి, వి.సతీష్, బి.వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్, వనితా క్లబ్ పాలకవర్గ సభ్యులు కె.పాపారావు, వి.వెంకటేశ్వర్లు, పి.రఘునీ, రాణి, ప్రవళిక, డాక్టర్ నాగేంద్ర, సతీష్, లోకేష్, రామ్‌నరేష్, డి.నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణ, చిన్నా, నరసింహారావు, నాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

హుజూర్‌నగర్ : ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్ అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీలో అల్పాహారం, భోజన హోటల్ యజమానులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌పై వేసి పార్సిల్స్ చేయడంతో ప్లాస్టిక్ కరిగి ఆహార పదార్థాల్లో కలుస్తుందని, దానిని తిన్నవారి కడుపులోకి చేరుతుందని చెప్పారు. పేపర్ కప్పుల్లో టీ, పాలు వేడి ద్రవాలు తాగితే అనారోగ్యం వస్తుందని అన్నారు. హోటళ్లలో మోదుగాకులు, తామరాకులు, అరిటాకులు లేదా బయోడిగ్రేడబుల్ కవర్లు మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

10న నేరేడుచర్లలో వనభోజనాలు

నేరేడుచర్ల : పట్టణంలో ఈనెల 10వ తేదీన వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణ ప్రముఖు తెలిపారు. శుక్రవారం స్థానికంగా పాత నేరేడుచర్ల, కమలానగర్, శివాజీనగర్, విద్యానగర్, నేరేడుచర్లకు చెందిన ప్రముఖులు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. వనభోజన కార్యక్రమంలో భాగంగా ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ, బాలమ్మ, కోటమైసమ్మతో పాటు బొడ్రాయిలకు పూజలు చేసి అనంతరం వనభోజనాలకు వెళ్లనున్నట్లు వారు తెలిపారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

కోదాడరూరల్ : మండలంలోని అశోక్‌నగర్‌లో గల శనగల రాధాకృష్ణ మానసిక దివ్యాంగుల కేంద్రంలో కోదాడకు చెందిన ఉపాధ్యాయుడు కడారి రామకృష్ణ తన తండ్రి పాపయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అన్నదానం చేశారు. కడారు వెంకటమ్మ, ధనలక్ష్మి, మోక్షిత, చంద్ర పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు ఇళ్లు మంజూరు చేయాలి

గరిడేపల్లి : అర్హులైన వికలాంగులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన వికలాంగుడు నర్సింహారావు నిరుపేద అయినప్పటికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, రామ్ సైదులు, ఇంతియాజ్, పిట్ట నరసయ్య, సారెడ్డి సుబ్బారెడ్డి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

మఠంపల్లి : సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొండేటి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పార్టీ మండల నాయకులు మోడే లింగయాదవ్, శ్రీనివాస్, నర్సింహారావు, నవీన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మోతె : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మోతె ఎస్సై టి.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అర్హులకు అందని ఇందిరమ్మ ఇళ్లు

మునగాల : మండలంలోని తాడువాయి పైలట్ గ్రామంగా ఎంపికైనా నేటికీ పలువురు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని బీసీ సంఘం మండల నాయకులు కోల ఆంజనేయు లు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన పలువురు లబ్ధిదారులు స్లాబ్‌లెవల్ వరకు నిర్మాణాలు పూర్తిచేసినా నేటి వరకు తొలివిడత బిల్లులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సకాలంలో బిల్లులు అందజేయాలని, అర్హులకు రెండవ విడతలో ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

కార్మికుల సంక్షేమానికి నిధులు ఖర్చు చేయాలి

మునగాల : వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం 5వ మండల మహాసభ విజయవంతానికి శుక్రవారం ఆయన కలకోవ, జగన్నాథపురం, నరసింహులగూడెం, రేపాల, సీతానగరం, విజయరాఘవపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గంట వెంకటేశ్వర్లు, షేక్ దస్తగిరి, కోల ఆంజనేయులు, నాగేంద్రబాబు, నాగరాజు, వెంకటేశ్వర్లు, అయ్యన్న, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసం పురస్కరించుకొని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు దేవాలయాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – సాక్షినెట్‌వర్క్


నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు


చిలుకూరు : నారాయణపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


హుజూర్‌నగర్: అభయాంజనేయస్వామి ఆలయంలో..


గరిడేపల్లి : గుండాలమ్మ తల్లి దేవాలయంలో..


కోదాడరూరల్ : తొగర్రాయిలోని మహాలక్ష్మి ఆలయంలో ..